క్లుప్తంగా

ఫంక్షన్లలో ప్లాస్టిక్ వాడొద్దు



ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న అధికారులు

కోరుట్లటౌన్: స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ ఆదేశాల మేరకు జీరో వేస్ట్ ఫంక్షన్ మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక జీ.ఎస్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించడం కోసం స్టీల్ ప్లేట్స్, స్టీలు గ్లాసులను ఉపయోగించి ఫంక్షన్ చేశారు. జీరో వేస్ట్ ఫంక్షన్ లక్ష్యం ప్లాస్టిక్ వాడకుండా చేయడమేనని ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మహేశ్, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానికులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

రాయికల్: రాయికల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్‌జోన్స్ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని నిరుపేదలకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. డీసీలు మ్యాకల రమేశ్, బత్తిని భూమయ్య, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎద్దండి దివాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రంజిత్, ఉపాధ్యక్షుడు మచ్చ శేఖర్, కొయ్యడి మహిపాల్, మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌గౌడ్

జగిత్యాలటౌన్: జిల్లా గ్రంథాలయ సంస్థ, ఇన్‌స్పైర్ ఇగ్నైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా గ్రంథాలయ ప్రాంగణంలో విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. ఫౌండేషన్ ప్రతినిధి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు రంజిత్‌ను సత్కరించారు. జిల్లా గ్రంథాలయ సిబ్బంది శకుంతల, అనిల్, రాజు, ఇన్‌స్పైర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



మేడిపెల్లి: భీమారం మండలంలోని కమ్మరిపేట్ గ్రామంలో ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం గ్రామంలోని యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని సర్పంచ్ పిట్టల లక్ష్మి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. రాజిరెడ్డి, రామిరెడ్డి, యువకులు పాల్గొన్నారు.

గంగనాల ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: గంగనాల ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి వెంటనే పనులు పూర్తి చేయాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని వేములకుర్తి శివారులో గంగనాల ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు జలయజ్ఞంలో భాగంగా గంగనాల ప్రాజెక్టును 2500 ఎకరాల నుంచి 6వేల ఎకరాలకు సాగు చేసేందుకు గాను రూ.20కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ నిధులతోనే గంగనాల ప్రాజెక్టు నుంచి మాటుకాలువను వెడల్పు చేసి ఇరువైపులా సిమెంట్ లైనింగ్ చేసి ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్‌కొండాపూర్ శివారు వరకు పూర్తి చేశారని తెలిపారు. ఫకీర్‌కొండాపూర్ శివారు నుంచి మల్లాపూర్ మండలంలోని గ్రామాలకు ఆయకట్టుకు నీళ్లు అందేందుకు గాను గంగనాల మాటుకాలువకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు బండి రెడ్డి, రాజలింగం, ప్రభాకర్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపుపై చర్యలేవి?

- గుట్టలను తవ్వుతూ రూ.కోట్లు కొల్లగొడుతున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- కనుమరుగవుతున్న ప్రకృతి సంపద



అక్రమార్కుల తవ్వకాలతో కోతకు గురైన గుట్ట



ట్రాక్టర్‌లో అక్రమంగా మట్టి తరలింపు

వెల్గటూర్: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అక్రమార్కులు ప్రకృతి సంపద కొల్లగొడుతున్నా కాపాడాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో మండలంలో మట్టి అక్రమ తరలింపునకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. అక్రమంగా గుట్టలు మొత్తం తవ్వేసి రూ.కోట్లు గడిస్తున్నారు. పట్టపగలే జేసీబీల సాయంతో గుట్టలు తవ్వి తహసీల్దార్ ఆఫీస్‌కు సమీపం నుంచే యథేచ్ఛగా ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో దందా సాగుతున్నా.. అధికార యంత్రాంగం అరికట్టలేకపోతోంది.

నూతన నిర్మాణాల కోసం..

నూతనంగా ఏర్పాటైన ఎండపల్లి మండల కేంద్రంలోని జొన్నలరాశి గుట్ట, పాతగూడూర్‌లోని దస్తగిరి గుట్ట, ఎండపల్లి, గుల్లకోట గ్రామాల శివారుల్లోని మిట్టతాళ్ల గుట్టలను ఇష్టానుసారంగా తవ్వేసి గుట్టలను కనుమరుగు చేస్తున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వదిలేయడంతో మట్టి అక్రమ తరలింపు మూడుపువ్వులు, ఆరుకాయలుగా సాగుతోందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎండపల్లికి సమీపంలోని ధర్మారం మండల కేంద్రంలో నూతన నిర్మాణాలకు, నూతనంగా ఏర్పడిన ఎండపల్లి మండల కేంద్రంలో నూతన వ్యాపార సముదాయాల నిర్మాణాలకు మట్టి అవసరం కావడంతో మట్టికి విపరీతమైన డిమాండ్ ఏర్పడడంతో రాజకీయ అండదండలు ఉన్న స్థానిక నేతలు మట్టి దందాను ఎంచుకున్నారు.

దృష్టిసారించని అధికారులు

నూతన గృహ నిర్మాణాలకు గానీ ఏదేని అవసరాలకు గానీ మట్టిని తరలించాలంటే రెవెన్యూ, మైనింగ్ శాఖల అనుమతి తప్పనిసరి. ముందుగా రెవెన్యూశాఖ అనుమతి తీసుకొని తర్వాత మైనింగ్ శాఖకు నిర్ణీత పన్ను చెల్లించి అనంతరం మట్టి తవ్వకాలు చేపట్టాలి. కానీ ఎండపల్లి మండలంలో ఈ నిబంధనలకు తిలోదకాలిచ్చిన మట్టి మాఫియా ఇష్టానుసారంగా మట్టిని తవ్వేస్తున్నారు. ఈ అక్రమ మట్టి తరలింపుపై అధిక సంఖ్యలో ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను, జేసీబీలను పట్టుకొని తూతూ మంత్రంగా జరిమానా విధించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని స్థానికంగా ఆరోపణలు వినవస్తున్నాయి. కోట్ల రూపాయల అక్రమ దందా చేస్తున్న ఈ అక్రమార్కులకు రాజకీయ నేతలు, అధికారుల అండదండలు ఉన్నాయని, అందుకే వీరిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మట్టి అక్రమ తరలింపుపై కఠిన చర్యలు తీసుకొని ప్రకృతి సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఈ మట్టి తవ్వకాలకు సంబంధించి అనుమతి మైనింగ్ శాఖ పరిధిలో ఉంటుంది. అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టిన వారి గురించి విచారణ జరిపించి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటాం.

– ఉదయ్‌కుమార్, తహసీల్దార్, ఎండపల్లి

అటెన్షన్ ప్లీజ్



నిరుపయోగంగా గ్రామీణ క్రీడా ప్రాంగణం

పెగడపల్లి: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేక దూరంగా వీటిని ఏర్పాటు చేశారు. ఈ మైదానాలు గ్రామాలకు దూరంగా ఉండటంతో క్రీడాకారులు అటువైపు వెళ్లేందుకు ఆశక్తి చూపడం లేదు. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేస్తున్న క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారుతున్నాయని ప్రజలు అంటున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ చూపి క్రీడా ప్రాంగణాల్లో క్రీడాపోటీలు ఏర్పాటు చేసి వీటిని వినియోగించేలా సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: పుల్లయ్య, ఎంపీడీవో
ఫోన్ నంబర్: 99897 73075

సంక్రాంతి అంటే సంబరమే



జగిత్యాల: మెడికల్ కాలేజ్‌లో భోగిమంటలు



రాయికల్: వేడుకల్లో విద్యార్థులు



ధర్మపురి: విజేతలకు బహుమతి ప్రదానం



సారంగాపూర్: విద్యార్థులతో కళాశాల బృందం

జగిత్యాల: సంక్రాంతి అంటేనే భోగభాగ్యాలు అందించే పండగ, సంస్కృతికి ప్రతిబింబం అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే భోగి వేడుకల్లో పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

రాయికల్: రాయికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. అనంతరం గొబ్బెలు, నవధాన్యాలు పోసి అలంకరించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీధర్, ఇమ్రాన్ ఖాన్, రాజమౌళి, దేవేందర్, చౌడారపు శ్రీనివాస్, రహీం, రాజేశ్వర్, రవీందర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

కళాశాలలో ముగ్గుల పోటీలు

కోరుట్ల: పట్టణంలోని పీఆర్‌బీఎం జూనియర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..

ధర్మపురి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతి ప్రదానం చేశారు.

జూనియర్ కళాశాలలో..

సారంగాపూర్: సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విస్సు, డి.అర్చన, కె.భాగ్యలక్ష్మికి బహుమతి ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా సురేశ్, సుజాత, స్వప్న వ్యవహరించారు. సమావేశంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొంకవేణు, లెక్చరర్లు రాజు, గంగన్న, భద్రి, రాజేందర్, సురేశ్, మహేశ్, సుజాత, అనిత పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిని వినియోగించుకోవాలి



ఎంపీటీసీని అభినందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆస్పత్రిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ ఎంపీటీసీ స్వప్న మగబిడ్డకు జన్మనిచ్చారు. రాజకీయ నాయకురాలు అయిన స్వప్న ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించడం ఎంతో అభినందనీయని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ శశికాంత్‌రెడ్డి, లచ్చనాయక్‌తండా సర్పంచ్ శ్రీలత, హరీశ్‌రావు, లక్ష్మీపతిరావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: ప్రజలు సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని 10వ వార్డులో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం వార్డులో ఇటీవల బీఆర్‌ఎస్ కార్యకర్త శంకర్ మృతిచెందగా అతడి కుటుంబాన్ని పరామర్శించారు. రాజయ్య, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నిరుపేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం

రాయికల్: నిరుపేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఆరుగురు సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్వయంగా ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో రూ.కోటితో చేపడుతున్న మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వైస్‌చైర్మన్ రమాదేవి, పట్టణ అధ్యక్షుడు ఇంతియాజ్, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కౌన్సిలర్లు శ్రీధర్‌రెడ్డి, సాయి, మహేశ్, శ్రీరాముల సత్యనారాయణ హుస్సేన్, యూత్ అధ్యక్షుడు రామ్మూర్తి, రాజేందర్, చంద్రశేఖర్, తేజ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లి గ్రామంలో సీసీరోడ్డు, డ్రెయినేజీలు, ఖబ్రస్థాన్, ఎల్లమ్మగుడి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్ అరుణ, ఉపసర్పంచ్ గంగాధర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం అంతర్గాం గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం 2023 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆవిష్కరించారు. నాయకులు నక్కల రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటలతో మానసిక ఉల్లాసం



కప్ ప్రదానం చేస్తున్న జీవన్‌రెడ్డి, లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్: ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామంలో డీసీసీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సౌజన్యంతో శ్రీవేంకటేశ్వర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన ముంజంపల్లి జట్టుకు రూ.15వేలు, రెండో స్థానంలో నిలిచిన కరీంనగర్ జట్టుకు రూ.10వేల ప్రైజ్ మనీతో పాటు షీల్డ్‌ను ఎమ్మెల్సీ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువత చదువు ధ్యాసలో పడి క్రీడలను నిర్లక్ష్యం చేస్తున్నారని, చదువుతో పాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమని, శారీరక, మానసిక వికాసానికి ఆటలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని, భవిష్యత్‌లో క్రీడల్లో రాణించి దేశానికి ప్రాతినిథ్యం వహించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఎంపీటీసీ రంగు తిరుపతి, మండల యూత్ అధ్యక్షుడు పూదరి రమేశ్, ముంజంపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు లింగారెడ్డి పాల్గొన్నారు.

నిధుల మళ్లింపుతో సర్పంచుల హక్కులకు విఘాతం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెగడపల్లి: కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా జీపీలకు విడుదల చేసిన నిధులను సర్పంచులకు తెలియకుండా దారి మళ్లించి ప్రభుత్వం సర్పంచుల హక్కులను కాలరాసిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం వారు మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పేరిట సర్పంచులు అప్పు చేసి మరీ పనులు చేస్తే వారికి బిల్లులు చెల్లించకపోవడంతో వారు అప్పుల పాలై ఆత్మహత్య చేసుకుంటున్నారని వాపోయారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చింతకింది అనసూర్య, జిల్లా అధికార ప్రతినిధి మంత్రిపల్లి సత్యం, మండల అధ్యక్షుడు కొమురెల్లి, నాయకులు బాబు, కిశోర్, నరేందర్, గంగాధర్, అంజన్న, రమేశ్, గట్టన్న, లక్ష్మీరాజం, అజయ్ పాల్గొన్నారు.

కంటివెలుగు కార్యక్రమం విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, డాక్టర్లు

మల్యాల: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీపీ విమల కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఆరోగ్య సిబ్బందికి కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణపై అవగాహన కల్పించారు. కంటి వెలుగు పోస్టర్‌ను ఆవిష్కరించారు. డాక్టర్ రవిశంకర్, డాక్టర్ సంతోష్, సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్, సూపర్ వైజర్లు సునంద పాల్గొన్నారు.

మహాసభలకు యూటీఎఫ్ నాయకులు

జగిత్యాల: రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో జరుగుతున్న 5వ రాష్ట్ర మహాసభలకు యూటీఎఫ్ నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతిపై పోరాడుతామన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్, భూమేశ్వర్, శ్రీనివాస్, సుశీల పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

పెగడపల్లి: సీఎం సహాయనిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి కోరారు. ఈ మేరకు మండలంలోని మద్దులపల్లిలో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి ఈశ్వర్ ఆదేశాల మేరకు శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామానికి చెందిన గజ్జల తరుణ్‌కుమార్‌కు రూ.60వేలు, పూసల గంగవ్వ రూ.60వేలు, ఏనుగు ప్రభాకర్ రూ.41,500, ఇరువురాళ్ల శంకరమ్మ రూ.35వేలు, జరుపుల రాజునాయక్ రూ.25వేలు, జరుపుల నిర్మల రూ.21వేలు, సురకంటి మధుసూదన్‌రెడ్డి రూ.15వేలు, సూర రాజనర్సయ్య రూ.15వేలు, అజ్మీర తిరుపతినాయక్ రూ.14వేలు, శివరాత్రి అక్షితకు రూ.13వేల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు గుర్రం మల్లారెడ్డి, సాయిల్ల ఎల్లయ్య, పెంటల శ్రీనివాస్, సాల్లేటి సంతోష్ పాల్గొన్నారు.

కథలాపూర్ మండలంలో నలుగురికి..

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల గ్రామంలో నలుగురికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఎనుగంటి పూజకు రూ.60వేలు, బోజగిరి రాజుకు రూ.56వేలు, కోడిగంటి రమేశ్‌కు రూ.24వేలు, జవిడి రాధకు రూ.24వేల విలువ గల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బాదినేని రమేశ్, కొండ ఆంజనేయులు, రైతుబంధు సమితి అధ్యక్షుడు బద్దం మహేందర్‌రెడ్డి, చెల్లపెల్లి అంజయ్య, జలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌడసంఘం నాయకుల ధర్నా

మేడిపెల్లి: ప్రకృతి సహజంగా లభించే నీరాకు వేదామృతం అని పేరు పెడితే తొలగించాలని కొంత మంది కావాలని కుట్రలు పన్నుతున్నారని గౌడ సంఘం మండల నాయకులు బాలసాని మారుతిగౌడ్ అన్నారు. పేరు తొలగించాలన్న డిమాండ్‌ను ఖండిస్తూ భీమారం మండల కేంద్రంలో శుక్రవారం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ముంజ శ్రీనివాస్‌గౌడ్, ఉత్కం శంకర్‌గౌడ్, గుగ్గిల్ల రవిగౌడ్, లింగంగౌడ్, నరేశ్‌గౌడ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ సింగిల్‌విండో డైరెక్టర్ రాజీనామా

కొడిమ్యాల: సింగిల్‌విండో పరిధిలోని నాచుపల్లి గ్రామానికి చెందిన 10వ వార్డు డైరెక్టర్ సురబి సాగర్‌రావు తన పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సాగర్‌రావు వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సింగిల్‌విండో సీఈవో గంగాధర్‌కు రాజీనామా లేఖ సమర్పించారు.

✦ దళితుల భూములకు రక్షణ కల్పించండి

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామ శివారులో దళితులకు చెందిన భూములను కొందరు ఆక్రమిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకొని రక్షించాలని ఆ గ్రామ అంబేడ్కర్ మాదిగ సంఘం నాయకులు శుక్రవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామశివారులో దళితులకు చెందిన 15 ఎకరాల భూములను ఇతరులు రాత్రివేళల్లో జేసీబీ, ట్రాక్టర్లతో చదును చేయిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీనివాస్, అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ మల్లేశం, ఎస్సై రామచంద్రానికి వేర్వేరుగా ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు. భూములను ఆక్రమిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సంఘం సభ్యులు కాశవత్రి వంశీ తదితరులు డిమాండ్ చేశారు.

✦ యువమోర్చా గ్రామ కార్యవర్గం

రాయికల్: అల్లీపూర్ గ్రామ యువమోర్చా కార్యవర్గాన్ని శుక్రవారం నియమించారు. అధ్యక్షుడిగా అత్తినేని నాగరాజు, కిష్టంపేట గ్రామ అధ్యక్షుడిగా వేములవాడ మహేశ్, కుర్మపల్లి అధ్యక్షుడిగా శంకర్, సింగరావుపేట అధ్యక్షుడిగా రమేశ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో యువమోర్చా మండల అధ్యక్షుడు రాజనాల మధు, నాయకుల ఎరవేని రవి, లక్ష్మణ్, ఆడెపు సురేశ్, మాజీ ఎంపీటీసీ బాలె చంద్రశేఖర్, సీనియర్ నాయకులు గొడ్డండ్ల శేఖర్, గాజంగి విష్ణువర్దన్, సాయిరాజ్‌గౌడ్, సందీప్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

✦ మండలాలకు నిధులు మంజూరు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు రూ.2కోట్ల చొప్పున ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. నిధుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, నల్ల మహిపాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

✦ పోస్టల్ పథకాలపై అవగాహన

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూర్ గ్రామంలో తపాలాశాఖ పథకాలపై శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ వనతడుపుల అంజయ్య, బ్రాంచ్ పోస్టుమాస్టర్ బుచ్చన్న, సిబ్బంది పాల్గొన్నారు.

✦ ఇంటింటా ప్రచారం

ఇబ్రహీంపట్నం: తపాలాశాఖ బీమా పథకాలపై మండలంలోని వర్షకొండలో పోస్ట్‌మాస్టర్ ప్రవీణ్ శర్మ ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ తపాలా బీమా పథకాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. తపాలా ఉద్యోగులు కొండయ్య, అనూహ్య, నాయకులు తుక్కారం, ఎంపీటీసీ పానకంటి వెంకట్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

✦ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలో రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సర్పంచ్ గర్శకుర్తి శిల్ప, చైతన్య యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి రంగనాథుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం గోదాదేవి రంగనాథుల కల్యాణాన్ని యజ్ఞాచార్యులు గాయత్రి లక్ష్మీనర్సింహచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ దొంతుల శ్యామల, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పానకంటి వెంకట్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దోమకొండ చిన్న రాజన్న, వీడీసీ సభ్యులు జోగ ధనుంజయ్, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, నర్సయ్య, నగేష్‌చారి, బాలకిషన్, అర్చకులు అన్వేష్ చార్యులు, రామచార్యులు, ప్రవీణ్‌శర్మ, బీఆర్‌ఎస్ నాయకులు మామిడి సురేశ్‌రెడ్డి, కాశీరావు పాల్గొన్నారు.